క్లుప్తంగా

ఫ్రీజర్ అందజేత



బిచ్కుంద(జుక్కల్): బిచ్కుంద లయన్స్ క్లబ్ ఆఫ్ డైమండ్ ఆధ్వర్యంలో మంగళవారం మున్సిపాలిటీకి ఉచితంగా ఫ్రీజర్‌ను అందించారు. బిచ్కుంద బండాయప్ప మఠం పీఠాధిపతి సోమాయప్ప స్వామి చేతుల మీదుగా కమిషనర్ ఖయ్యుంకు ఫ్రీజర్‌ను అందించారు. లయన్స్ క్లబ్ అధ్యక్షుడు వైద్యుడు రాజు, రీజినల్ చైర్ పర్సన్ వైద్యుడు ఓంప్రకాష్, గోపాల్, లక్ష్మణ్, జగదీష్ పాల్గొన్నారు.

రామాలయం నిర్మాణానికి రూ.2 లక్షల విరాళం



భిక్కనూరు: రామేశ్వర్‌పల్లిలో నిర్మిస్తున్న రామాలయానికి కామారెడ్డి మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు ఊడేమ్ శ్రీనివాస్‌రెడ్డి-సుష్మ దంపతులు రూ.2 లక్షలను మంగళవారం విరాళంగా అందజేశారు. ఈ సందర్భంగా శ్రీనివాస్‌రెడ్డిని గ్రామస్తులు సన్మానించారు. గ్రంథాలయ సంస్థ చైర్మన్ చంద్రకాంత్‌రెడ్డి, ఆలయ నిర్మాణ కమిటీ ప్రతినిధులు పాల్గొన్నారు.

కార్మికులకు వైద్య పరీక్షలు



ఎల్లారెడ్డిరూరల్: ఎల్లారెడ్డి పట్టణంలోని మున్సిపల్ కార్మికులకు మంగళవారం వైద్య పరీక్షలు నిర్వహించారు. మున్సిపల్ కార్యాలయంలో నిర్వహించిన ప్రత్యేక వైద్య శిబిరంలో కార్మికులకు వైద్య పరీక్షలు నిర్వహించి మందులను కమిషనర్ అందించారు. మున్సిపల్ కమిషనర్ మహేష్ కుమార్, తదితరులున్నారు.

బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడితో భేటీ



బాన్సువాడ: బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రామచంద్రరావుతో మంగళవారం హైదరాబాద్‌లోని బీజేపీ కార్యాలయంలో బాన్సువాడ బీజేపీ నాయకులు మర్యాద పూర్వకంగా భేటీ అయ్యారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో బీజేపీ సత్తాచాటేలా కార్యకర్తలు కృషి చేయాలని ఆయన సూచించినట్లు నేతలు తెలిపారు. బీజేపీ నాయకులు లక్ష్మీనారాయణ, కోనాల గంగారెడ్డి, శంకర్‌గౌడ్, శ్రీనివాస్, చీదరి సాయిలు, చిరంజీవి, చీకట్ల రాజు, శివశంకర్, పాశం భాస్కర్‌రెడ్డి తదితరులున్నారు.

ఆస్పత్రి పరిశీలన



బిచ్కుంద(జుక్కల్): మండల కేంద్రంలోని ప్రభుత్వ ఆస్పత్రిని మంగళవారం ఎమ్మెల్యే లక్ష్మీకాంతారావు పరిశీలించారు. ప్రతి రోజు ఎంత మంది రోగుల వస్తున్నారు.. వారికి ఎలాంటి సౌకర్యాలు ఉన్నాయి.. అన్ని రకాల మందులు అందుబాటులో ఉన్నాయా లేదా తదితర వివరాలను వైద్యులను అడిగి వివరాలు తెలుసుకున్నారు.

డ్రైయినేజీ పనులు..

మండల కేంద్రంలో సెంట్రల్ లైటింగ్ పనులలో భాగంగా రోడ్డుకు రెండు వైపులా కొనసాగుతున్న డ్రైనేజీ పనులను ఎమ్మెల్యే పరిశీలించారు. ప్రజలు పనులకు అడ్డంకులు సృష్టించకుండా సజావుగా కొనసాగేలా అధికారులకు సహకరించాలని కోరారు. అధికారులు ప్రతి రోజు పనులు, నాణ్యతను పరిశీలించాలని సూచించారు. అనంతరం కాంగ్రెస్ కార్యకర్త ఖలీల్‌ను ఎమ్మెల్యే పరామర్శించారు.

కేంద్రీయ విద్యాలయానికి స్థలం..

మద్నూర్(జుక్కల్): మండల కేంద్రంలో నిర్మించనున్న కేంద్రీయ విద్యాలయం కోసం స్థలాన్ని ఎమ్మెల్యే పరిశీలించారు. ఆర్‌అండ్‌బీ గెస్ట్‌హౌజ్ 4 ఎకరాల స్థలాన్ని ఎమ్మెల్యే పరిశీలించారు. ప్రస్తుతం స్థానిక జిల్లా పరిషత్ పాఠశాలలో తాత్కాలింగా ఏర్పాటు కోసం అధికారులు ప్రభుత్వానికి నివేదిక పంపించారని అన్నారు. త్వరలోనే కేంద్రీయ విద్యాలయం ప్రారంభమవుతుందన్నారు. తహసీల్దార్ ముజీబ్, నాయకులు పాల్గొన్నారు.

సమ్మెను విజయవంతం చేయాలి

భిక్కనూరు: నేటి దేశవ్యాప్త సమ్మెను విజయవంతం చేయాలని తెలంగాణ బహుళ జన బీడీ కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఎస్. సిద్ధరాములు కోరారు. మంగళవారం భిక్కనూరు శివసాగర్ బీడీ కంపెనీ మేనేజర్‌కు సమ్మె నోటీస్‌ను కార్మికులతో కలిసి అందజేశారు. బీఎల్‌టీయూ నేతలు ఎల్లయ్య, స్వామి పాల్గొన్నారు.

మాయమైన మంకీ ఫుడ్ కోర్టులు

- ఫలించని ప్రభుత్వ ఆశయం.. వృథా అయిన ప్రజాధనం
- గాంధారి మంకీ ఫుడ్ కోర్టులో మొక్కజొన్న సాగు



గాంధారి మంకీ కోర్ట్‌లో సాగు చేసిన మొక్కజొన్న



మొక్కజొన్న పంట చుట్టూ వేసిన కంచెను తొలగిస్తున్న ఉపాధి కూలీలు (ఫైల్)

గాంధారి(ఎల్లారెడ్డి): అడవుల్లో ఉండాల్సిన కోతులు ఊర్ల మీద పడి ప్రజలను భయభ్రాంతులకు గురిచేస్తున్నాయని, వాటిని అడవుల్లోనే ఉండేలా చేయాలని అప్పటి సీఎం కేసీఆర్ ప్రతి గ్రామ శివారులో పండ్లు, కాయలు ఇచ్చే చెట్లను పెంచాలని నిర్ణయించారు. హరితహారం పథకంలో భాగంగా మంకీ ఫుడ్ కోర్ట్ పేరుతో వివిధ రకాల పండ్ల మొక్కలు నాటించారు. కాని ప్రభుత్వ ఆశయం ఫలించలేదు. ప్రజాధనం వృథా అయింది. కొన్ని గ్రామాల్లో మంకీ ఫుడ్ కోర్టులో కొన్ని మొక్కలు పెరిగాయి. కాని కొన్ని గ్రామాల్లో ఫుడ్ కోర్టులు మాయమయ్యాయి. మండల కేంద్రం సమీపంలో అటవీ భూమిలో వేల సంఖ్యలో వివిధ రకాల పండ్ల మొక్కలు నాటారు. బాగానే పెరిగాయి. కాయలు, పండ్లు కాచే సమయంలో కొందరు గిరిజన రైతులు ఆ మంకీ ఫుడ్ కోర్టును ధ్వంసం చేసి పంటలు సాగు చేశారు. గమనించిన అప్పటి గాంధారి సర్పంచ్ సంజీవు ఆధ్వర్యంలో పంచాయతీ పాలకవర్గం, గ్రామస్తులు ఫుడ్ కోర్టును ఆక్రమించిన రైతు ఏర్పాటు చేసిన కంచెను తొలగించారు. ఇరు వర్గాల మధ్య ఘర్షణ జరిగింది. సర్పంచ్ ఫిర్యాదుతో కేసు నమోదు అయింది. అయినా ఆ భూమి స్వాధీనం కాకపోగా పంటలు సాగు చేస్తూనే ఉన్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు చర్యలు తీసుకుని మంకీ ఫుడ్ కోర్ట్ భూమిని తిరిగి స్వాధీనం చేసుకుని ప్రజలకు ఉపయోగపడే మొక్కలు నాటాలని ప్రజలు కోరుతున్నారు.

కేసులు నమోదయ్యాయి

అప్పట్లో నేను ఇక్కడికి రాలేదు. అయినా మంకీ ఫుడ్ కోర్టును ఆక్రమించిన వారిపై కేసులు నమోదయ్యాయని తెలిసింది. ఇదే విషయంలో అప్పటి తహసీల్దార్, ఎంపీడీవో.. కలెక్టర్‌కు రిపోర్ట్ పెట్టారు. ప్రస్తుతం వనమహోత్సవంలో భాగంగా మళ్లీ మొక్కలు నాటుతున్నాం.

– నాగరాజు, జీపీ కార్యదర్శి, గాంధారి

సమాచారం తెలుసుకుని వివరాలు ఇస్తా

మంకీ ఫుడ్ కోర్టులో మొక్కలు నాటినప్పుడు నేను ఇక్కడ లేను. చాలా రోజులైంది. ఉపాధి హామీలో సమాచారం తీసుకుని పూర్తి వివరాలు అందిస్తాను.

– రాజేశ్వర్, ఎంపీడీవో, గాంధారి

పారిశుద్ధ్య పనుల నిర్వహణ



బీబీపేట: మండల కేంద్రంలోని పలు కాలనీల్లో మంగళవారం నిర్వహించిన పారిశుద్ధ్య పనులను మండల ప్రత్యేకాధికారి శ్రీనివాస్ పరిశీలించారు. వర్షాకాలంలో ప్రజలు తగు జాగ్రత్తలు పాటించాలని సూచించారు. అనంతరం వనమహోత్సవం సందర్భంగా రోడ్లకు ఇరువైపుల మొక్కలు నాటారు. ప్రతి ఇంటికి మొక్కలు పంపిణీ చేస్తామన్నారు. నాటిన మొక్కలను సంరక్షించాలని కోరారు. ఎంపీడీవో పూర్ణచంద్రోదయ కుమార్, ఎంపీవో అబ్బాగౌడ్, కార్యదర్శి రమేష్ ఉన్నారు.

సీజనల్ వ్యాధులపై అవగాహన



ఎల్లారెడ్డి: సీజనల్ వ్యాధులు వ్యాపించకుండా ఆరోగ్య సిబ్బంది మంగళవారం ప్రజలకు అవగాహన కల్పించారు. పట్టణంలోని 9వ వార్డులో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి వివరించారు. ప్రజలు పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని, ఎక్కువ కాలం నీటి నిల్వ ఉండకుండా చూడాలని, వారానికోసారి నీటి కుండీలు శుభ్రం చేసుకోవాలన్నారు. ఆరోగ్య సిబ్బంది ఇందిర, మున్సిపల్ సిబ్బంది తదితరులున్నారు.

ఎమ్మెల్యేకు ఆహ్వాన పత్రిక అందజేత



దోమకొండ: మండల కేంద్రంలోని చాముండేశ్వరి ఆలయ బోనాల పండుగకు హాజరు కావాలని కోరుతూ మంగళవారం కామారెడ్డి ఎమ్మెల్యే కాటిపల్లి వెంకటరమణారెడ్డికి చాముండేశ్వరి ఆలయ కమిటీ సభ్యులు ఆహ్వాన పత్రికను అందజేశారు. ఆలయ కమిటీ అధ్యక్షులు పెద్దిరెడ్డి సిద్ధారెడ్డి, అర్చకులు శరత్ చంద్ర, బీజేపీ దోమకొండ మండల అధ్యక్షుడు మద్దూరి భూపాల్ రెడ్డి, కామారెడ్డి అసెంబ్లీ ఇన్‌చార్జి కుంట లక్ష్మారెడ్డి పాల్గొన్నారు.

ఏఐఎస్‌ఎఫ్ ఆధ్వర్యంలో హాస్టళ్ల సందర్శన

కామారెడ్డి టౌన్: జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ సంక్షేమ హాస్టళ్లను ఏఐఎస్‌ఎఫ్ ఆధ్వర్యంలో సందర్శించారు. విద్యార్థులతో మాట్లాడి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వం తక్షణమే హాస్టల్‌లలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. జిల్లా కన్వీనర్ శివప్రసాద్, సంపత్, సుమన్, హరీష్, అభి, లడ్డు తదితరులున్నారు.

తండాలను జీపీలుగా మార్చాలి

కామారెడ్డి టౌన్: గ్రామాలకు దూరంగా ఉన్న తండాలను గ్రామ పంచాయతీలుగా ఏర్పాటు చేయాలని లంబాడీ హక్కుల పోరాట సమితి జిల్లా అధ్యక్షుడు గణేష్ నాయక్ డిమాండ్ చేశారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని ఆర్ అండ్‌బీ అతిథి గృహంలో ఆయన మాట్లాడారు. గిరిజనులకు 10 శాతం రిజర్వేషన్లు పెంచాలని, లంబాడీల భాష గోర్ బోలీని 8వ షెడ్యూల్‌లో చేర్చాలని, తదితర గిరిజనుల డిమాండ్లను ప్రభుత్వం పరిష్కరించాలని కోరారు. రాష్ట్ర కార్యదర్శి వినోద్, జిల్లా ప్రధాన కార్యదర్శి బద్రినాయక్, గౌరవ అధ్యక్షుడు రూప్‌సింగ్, తదితరులున్నారు.

సమస్యలను పరిష్కరించాలని వినతి

కామారెడ్డి టౌన్: మున్సిపల్‌లో విధులు నిర్వహిస్తున్న కార్మికుల సమస్యలను పరిష్కరించాలని సీఐటీయూ, మున్సిపల్ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో మంగళవారం కమిషనర్ రాజేందర్‌రెడ్డికి వినతిపత్రం అందజేశారు. యూనియన్ జిల్లా అధ్యక్షుడు రాజనర్సు మాట్లాడుతూ.. ఈ మధ్య కాలంలో మరణించిన కార్మికుల కుటుంబంలో ఒకరికి, అలాగే 60 ఏళ్ల వయస్సు నిండిన కార్మికుల బదులుగా వారి కుటుంబంలో ఒకరి ఉద్యోగ అవకాశం కల్పించాలని, కనీస వేతనం అమలు చేయాలని కోరారు.

నాటిన మొక్కలను జాగ్రత్తగా కాపాడాలి





గాంధారి శివారులో మొక్కలు నాటుతున్న అధికారులు, ఎర్రాపహాడ్‌లో ..



భూంపల్లిలో..



మాల్తుమ్మెదలో విద్యార్థులతో కలిసి..

జిల్లాలో పలు చోట్ల మంగళవారం వనమహోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా పలు గ్రామాల్లో స్థానిక ప్రజాప్రతినిధులతో కలిసి అధికారులు మొక్కలు నాటారు.లక్ష్యం మేరకు మొక్కలు నాటాలని, నాటిన మొక్కలను జాగ్రత్తగా కాపాడాలని అధికారులు సూచించారు.

– సాక్షి నెట్‌వర్క్

వనమహోత్సవంతో పచ్చదనం



ఈత మొక్కలను నాటుతున్న నేతలు, అధికారులు

భిక్కనూరు: ప్రభుత్వం ప్రవేశపెట్టిన వనమహోత్సవంతో రాష్ట్రం పచ్చదనంతో వెల్లివిరుస్తుందని కాంగ్రెస్ రాష్ట్ర కార్యదర్శి ఇంద్రకరణ్‌రెడ్డి అన్నారు. మంగళవారం రామేశ్వర్‌పల్లిలో అబ్కారీ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన వనమహోత్సవంలో ఈత మొక్కలను గ్రంథాలయ సంస్థ చైర్మన్ మద్ది చంద్రకాంత్ రెడ్డితో కలిసి నాటారు.ఈ సందర్భంగా ఇంద్రకరన్ రెడ్డి మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ ఏడాదికి రెండు మొక్కలను నాటి సంరక్షించాలన్నారు. అబ్కారీ శాఖ సీఐ మధుసూదన్‌రావు, ఎంపీడీవో రాజ్‌కిరణ్‌రెడ్డి, వీడీసీ అధ్యక్షుడు సూర్యకాంత్‌రెడ్డి, గౌడ సంఘం ప్రతినిధులు పాల్గొన్నారు.

బుడిమిలో పొలంబాట



పాల్గొన్న విద్యుత్ అధికారులు, సిబ్బంది, రైతులు

బాన్సువాడ రూరల్: బుడిమి గ్రామంలో మంగళవారం విద్యుత్‌శాఖ ఆధ్వర్యంలో పొలంబాట కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా ట్రాన్స్‌కో డీఈ ప్రభాకర్ మాట్లాడుతూ.. రైతులు నేరుగా ట్రాన్స్‌ఫార్మర్లు, బోరుబావుల వద్ద విద్యుత్ పనులు చేయరాదన్నారు. ఏదైనా సమస్య వస్తే లైన్‌మెన్‌ను సంప్రదించాలన్నారు. విద్యుత్ సమస్యల పరిష్కారానికి 1912 టోల్‌ఫ్రీ నెంబర్‌కు కాల్ చేయాలన్నారు. విద్యుత్ పొదుపు, భద్రతపై రైతులకు పలు సూచనలు చేశారు. ఏడీఈ సంజీవ్‌రావు, ట్రాన్స్‌కో రూరల్ ఏఈ అనిల్ కుమార్, గ్రామస్తులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌కు ఘన నివాళులు



తాడ్వాయి: దేమికలాన్‌లోని వైఎస్సార్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న కాంగ్రెస్ నాయకులు



పిట్లంలో..



మద్నూర్‌లో ..



గోపాల్‌పేటలో..

సాక్షి నెట్‌వర్క్: దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర రెడ్డి జయంతిని మంగళవారం జిల్లాలో పలుచోట్ల కాంగ్రెస్ నాయకులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన విగ్రహాలు, చిత్రపటాలకు పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. నాయకులు మాట్లాడుతూ.. ఆరోగ్యశ్రీ పథకం ప్రారంభించి ఎందరో పేదలను కాపాడిన మహానుభావుడు వైఎస్సార్ అని కొనియాడారు. ప్రతి పేదవాడు చదువుకోవాలని ఉద్దేశంతో ఫీజు రీయింబర్స్‌మెంట్ పథకాన్ని ప్రారంభించి పేదల పాలిట ఆయన దేవుడయ్యారని ప్రశంసించారు. ఉమ్మడి రాష్ట్రానికి ఆయన చేసిన సేవలను కొనియాడారు.

రాజన్న పాలన.. ప్రజాపాలన రెండూ ఒక్కటే



భిక్కనూరులో నివాళులర్పిస్తున్న కాంగ్రెస్ నేతలు

భిక్కనూరు: దివంగత సీఎం రాజన్న(వైఎస్సార్) పాలన ప్రస్తుత సీఎం రేవంత్‌రెడ్డి ప్రజాపాలన రెండూ ఒక్కటేనని జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మద్ది చంద్రకాంత్‌రెడ్డి అన్నారు. మంగళవారం దివంగత సీఎం వైఎస్సార్ 76వ జయంతిని భిక్కనూరు మండల కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా వైఎస్సాఆర్ విగ్రహానికి పూల మాలలు వేసి నివాళ్లు అర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. రాజన్న పాలనలో రైతులు ఏవిధంగా సంతోషంగా వ్యవసాయాన్ని సాగు చేసుకున్నారో.. నేడు సీఎం రేవంత్‌రెడ్డి ప్రజాపాలనలో కూడా అదే విధంగా వ్యవసాయాన్ని సాగు చేసుకుంటున్నారన్నారు. వైఎస్సాఆర్ ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. డీసీసీబీ మాజీ చైర్మన్ ఎడ్ల రాజిరెడ్డి, పీసీసీ కార్యదర్శి ఇంద్రకరణ్‌రెడ్డి, నేతలు బల్యాల సుదర్శన్, జాంగారి గాలిరెడ్డి, గంగళ్ల భూమయ్య, నీల అంజయ్య, మైపాల్‌రెడ్డి, అంకం రాజు, జగ్గారెడ్డి, శ్రీరాం వెంకటేశ్ తదితరులు పాల్గొన్నారు.

మహిళలు వ్యాపారవేత్తలుగా ఎదగాలి



లింగంపేటలో ఇందిర మహిళా శక్తి సంబరాల్లో పాల్గొన్న అధికారులు, మహిళలు

లింగంపేట(ఎల్లారెడ్డి): మహిళలు వ్యాపారవేత్తలుగా ఎదగాలని ఐకేపీ డీపీఎం రాజయ్య సూచించారు. మంగళవారం లింగంపేట మహిళా సమాఖ్య కార్యాలయంలో ఏర్పాటు చేసిన ఇందిర మహిళ శక్తి సంబరాల్లో పాల్గొని మాట్లాడారు. మహిళలు ఆర్థికంగా ఎదగడానికి బ్యాంకుల ద్వారా రుణాలు అందజేస్తున్నట్లు తెలిపారు. మండల సమాఖ్య అధ్యక్షురాలు సులోచన, సీబీవో రామచంద్రాగౌడ్, స్త్రీనిధి మేనేజర్ అమల, ఏపీఎం శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

కోటీశ్వరులుగా చేయడమే ప్రభుత్వ లక్ష్యం

ఎల్లారెడ్డి: మహిళలను కోటీశ్వరులుగా చేయడమే ప్రభుత్వ లక్ష్యమని ఎంపీడీవో ప్రకాష్ అన్నారు. మంగళవారం ఎంపీడీవో కార్యాలయంలో నిర్వహించిన ఇందిరా మహిళా శక్తి సంబరాల కార్యక్రమంలో భాగంగా కార్యాలయం ఆవరణలో స్త్రీనిధి ఆర్ఎం కిరణ్‌తో కలిసి మొక్కలను నాటారు. ఏపీఎం ప్రసన్నరాణి, మండల సమాఖ్య సిబ్బంది తదితరులున్నారు.

గ్రామ సంఘాలు అభివృద్ధిని సాధించాలి

సదాశివనగర్(ఎల్లారెడ్డి): మండలంలోని గ్రామ సంఘాలు పురోభివృద్ధిని సాధించాలని మండల ప్రత్యేక అధికారి సతీష్ యాదవ్ ఆకాంక్షించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఇందిరా మహిళ శక్తి కార్యక్రమం నిర్వహించి మాట్లాడారు. సంఘాలలో లేని మహిళలను గుర్తించి సంఘాలలో చేర్పించాలని పేర్కొన్నారు. ఎంపీడీవో సంతోష్ కుమార్, ఏపీఎం రాజిరెడ్డి, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ పద్మావతి, వైద్యాధికారిణి ఆస్మా, తదితరులు పాల్గొన్నారు.

రుణాలతో మహిళలు ఆర్థికంగా ఎదగాలి

దోమకొండ: స్త్రీనిధి, ఇతర బ్యాంకు రుణాల ద్వారా మహిళలు ఆర్థికంగా ఎదగాలని ఐకేపీ అదనపు డీఆర్‌డీవో విజయలక్ష్మి అన్నారు. దోమకొండ మహిళా సమాఖ్యలో ఇందిరా మహిళా శక్తి సంబరాలు నిర్వహించగా ఆమె పాల్గొని మాట్లాడారు. మండల ప్రత్యేక అధికారి జ్యోతి, ఎంపీడీవో ప్రవీణ్ కుమార్, ఐకేపీ ఏపీఎం రాజు, తదితరులు హాజరయ్యారు.

అన్ని రంగాల్లో ముందుకెళ్లాలి

పెద్దకొడప్‌గల్(జుక్కల్): మహిళలు అన్ని రంగాల్లో ముందుకెళ్లాలని మండల ప్రత్యేక అధికారి కిషన్ వ్యాఖ్యానించారు. మంగళవారం స్థానిక ఐకేపీ కార్యలయంలో ఇందిరా మహిళ శక్తి సంబరాలు నిర్వహించారు. ఎంపీడీవో లక్ష్మీకాంత్‌రెడ్డి, ఐకేపీ, మహిళ సమాఖ్య సభ్యులు పాల్గొన్నారు.

చెట్ల తీగల తొలగింపు



సాక్షి ఎఫెక్ట్..

తాడ్వాయి(ఎల్లారెడ్డి): సాక్షి దినపత్రికలో మంగళవారం అల్లుకున్న నిర్లక్ష్యం అనే శీర్షికన ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. మండలంలోని కామారెడ్డి -ఎల్లారెడ్డి ప్రధాన రహదారి ప్రక్కన ఉన్న విద్యుత్ సంభాలకు అల్లుకున్న చెట్ల తీగలను విద్యుత్ అధికారులు మంగళవారం తొలగించారు. ఏడీఈ కిరణ్ చైతన్య, లైన్‌మెన్ బాలరాజు తదితరులు పాల్గొన్నారు.

సంప్రదాయబద్ధంగా సీతల్ పండగ



కామారెడ్డి అర్బన్: వానలు బాగా పడి చెరువులు కుంటలు నిండి పాడి పంటలు సమృద్ధిగా పండాలని ప్రకృతి దేవతలను ఆరాధిస్తూ ఆషాఢ మంగళవారం కామారెడ్డి మండలం క్యాసంపల్లి తండాలో గిరిజనులు భక్తిశ్రద్ధలతో సీతల్ దాటుడు పండుగ నిర్వహించారు. తండాలో పెళ్లి కాని అమ్మాయిలు సంప్రదాయబద్ధంగా అలంకరించుకుని అమ్మవార్లకు నైవేద్యాలను సమర్పించారు.

సంక్షిప్తం

పకడ్బందీగా సర్వే నిర్వహిస్తున్నాం

తాడ్వాయి(ఎల్లారెడ్డి): ఇటీవల గ్రామాలలో నిర్వహించిన భూభారతి రెవెన్యూ సదస్సులలో వచ్చిన దరఖాస్తులపై పకడ్బందీగా సర్వే నిర్వహిస్తున్నామని తాడ్వాయి తహసీల్దార్ శ్వేత తెలిపారు. నందివాడ, సంగోజీవాడి గ్రామాల్లో దరఖాస్తులపై ఆమె అధికారులతో కలిసి మంగళవారం సర్వే నిర్వహించారు. ఆర్ఐ హారిక, సర్వేయర్ మౌనిక తదితరులు పాల్గొన్నారు.

సదస్సును విజయవంతం చేయండి

బాన్సువాడ రూరల్: జిల్లా కేంద్రంలోని కళాభారతిలో ఈనెల 27న ఆలిండియా అంబేడ్కర్ యువజన సంఘం ఆధ్వర్యంలో నిర్వహించనున్న భారత రాజ్యాంగ పరిరక్షణ, బహుజన అలయ్ బలయ్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని సంఘం నాయకులు కోరారు. బహుజన అలయ్ బలయ్ కరపత్రాలను ఆవిష్కరించి పంపిణీ చేశారు. సంఘం కామారెడ్డి జిల్లా అధ్యక్షుడు బి.రాజ్‌కుమార్, జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ బాలరాజ్, రాష్ట్ర ఉపాధ్యక్షులు బంగారు మైసయ్య, రాష్ట్ర కార్యదర్శి నెర్రె నర్సింలు పాల్గొన్నారు.

అభివృద్ధి చూసి ఓర్వలేకే బురదజల్లే ప్రయత్నాలు

ఎల్లారెడ్డి: ఎల్లారెడ్డిలో ఎమ్మెల్యే మదన్‌మోహన్‌రావు చేస్తున్న అభివృద్ధిని చూసి ఓర్వలేకే ప్రతిపక్షాలు బురద జల్లే ప్రయత్నాలు చేస్తున్నాయని మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు కుర్మ సాయిబాబా అన్నారు. మంగళవారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఆయన మాట్లాడారు. మల్కాపూర్‌లో బీజేపీ నేత నర్సింలు ఇంటిని కూల్చి వేయడంలో ఎమ్మెల్యే పాత్ర ఉందని అసత్య ఆరోపణలు చేయడం సరికాదన్నారు. నేతలు ఆశమోల్ల సాయిబాబా, ప్రశాంత్‌గౌడ్, కుడుముల సత్యనారాయణ, వెంకట్రాంరెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, తదితరులున్నారు.

రైతుల సంక్షేమమే ప్రభుత్వ ఆశయం

గాంధారి(ఎల్లారెడ్డి): రైతుల సంక్షేమమే ప్రభుత్వ ఆశమని గాంధారి సింగిల్ విండో చైర్మన్ సాయికుమార్ అన్నారు. మండల పరిధిలోని నేరల్ తండాలో నూతనంగా నిర్మించిన గోదామును తండావాసులతో కలిసి ప్రారంభించారు. నేరల్, నేరల్ తండా, నాగ్లూర్, నాగ్లూర్ తండా, చద్మల్, చద్మల్ తండా, దుబ్బ తండా రైతులకు నూతనంగా నిర్మించిన గోదాంలోనే ఎరువుల బస్తాలు అందుబాటులో ఉంటాయన్నారు. విండో డైరెక్టర్లు నెహ్రూ, గాండ్ల లక్ష్మణ్, సీఈవో సాయిలు, రైతులు పాల్గొన్నారు.

తిప్పాపూర్ అయ్యప్ప సేవా సంఘం కార్యవర్గం

భిక్కనూరు: తిప్పాపూర్ గ్రామ అయ్యప్ప సేవా సంఘం నూతన కార్యవర్గంను మంగళవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా ఎన్ను రమేష్‌రెడ్డి, గౌరవ అధ్యక్షుడిగా వీరమల్లి శ్రీనివాస్, ఉపాధ్యక్షుడిగా కుంట నర్సరెడ్డి, ప్రధాన కార్యదర్శిగా వీరమల్లి శ్రీనుబాబు, తదితరులు ఎన్నికయ్యారు. ఎన్నికైన వారిని సత్కరించారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కుల అందజేత

రాజంపేట: కొండాపూర్, ఎల్లారెడ్డిపల్లి, గుండారం, షేర్ శంకర్ తండా, గుడితండా, నడిమి తండా గ్రామాలలోని పలువురి లబ్ధిదారులకు ఇంటింటికి వెళ్లి చెక్కుల పంపిణీ కార్యక్రమాన్ని చేపట్టినట్లు మండల వర్కింగ్ ప్రెసిడెంట్ ప్రణీత్ రెడ్డి తెలిపారు. కార్యక్రమంలో మండల సీనియర్ నాయకులు భీమరి శ్యామయ్య, దేవీసింగ్, శంకరి గారి బాలరాజ్, స్వామి యాదవ్, మదన్, సాయిలు, నరేందర్ గౌడ్, సిద్దిరెడ్డి పాల్గొన్నారు.